క్లుప్తంగా

అమ్మవారికి 108 చీరలతో అలంకరణ



చీరల అలంకరణలో అమ్మవారు

మధురవాడ: శ్రావణ మాసం ఆఖరి మంగళవారం సందర్భంగా జీవీఎంసీ ఆరోవార్డు రేవళ్లపాలెంలోని భూలోకమాతను ప్రత్యేకంగా అలంకరించారు. 108 చీరలతో అమ్మవారిని అలంకరించి, విశేష పూజలు చేశారు. పరిసర ప్రాంతాల భక్తులు అధికసంఖ్యలో తరలి వచ్చి, అమ్మవారిని దర్శించుకున్నారు.

విరిసిన బ్రహ్మకమలాలు



లక్ష్మీపురంలో విరిసిన బ్రహ్మకమలాలు

తగరపువలస: భీమిలి మండలం లక్ష్మీపురం పంచాయతీ కరుభుక్త జగన్‌మోహనరావు ఇంట్లో సోమవారం అర్ధరాత్రి నాలుగు బ్రహ్మ కమలాలు విరిశాయి. రాత్రి 12 గంటల నుంచి వేకువజామున 4 గంటల వరకు సువాసనలు వెదజల్లే ఈ కమలాలను పంచాయతీ ప్రజలు తిలకించి పూజలు చేశారు. ఈ మొక్కను ఇటీవల కోల్‌కత్తా నుంచి తీసుకు వచ్చినట్టు జగన్‌మోహనరావు తెలిపారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు ఆహ్వానం

తగరపువలస: చిట్టివలస(తగరపువలస) ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏడు కోర్సులలో ప్రవేశాల కోసం బుధవారం నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నట్టు ప్రిన్సిపాల్ పి.శ్రీవాణి తెలిపారు. వీటిలో బీఏలో హిస్టరీ-పొలిటికల్ సైన్స్, బీకాంలో కంప్యూటర్ అప్లికేషన్-కామర్స్, బీఎస్సీలో బోటనీ-జువాలజీ, కెమిస్ట్రీ-కంప్యూటర్ సైన్స్, కంప్యూటర్ సైన్స్-ఫిజిక్స్, మేథమెటిక్స్-కెమిస్ట్రీ, జువాలజీ-బోటనీ కోర్సులు ఉన్నాయి. అనుభవజ్ఞులైన అధ్యాపకుల చేత బోధన నిర్వహించడంతో పాటు ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాల సౌకర్యం కల్పించనున్నట్టు తెలిపారు. కళాశాల ప్రవేశాల కోసం అధ్యాపకులు బి.సీతన్నాయుడు-89788 83125, ఎ.విజయలక్ష్మి-85229 75829 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

బంగారమ్మ తల్లికి పసుపు కుంకుమల సమర్పణ

తగరపువలస: భీమిలి మండలం లక్ష్మీపురం గ్రామదేవత బంగారమ్మకు పంచాయతీ ప్రజలు మంగళవారం పసుపు కుంకుమలు సమర్పించారు. డీజే, బాణసంచా, సారెతో పంచాయతీ వాసులు అమ్మవారికి మొక్కులు చెల్లించారు.

అర్హులైన దివ్యాంగులు అర్జీలు పెట్టుకోవాలి

పద్మనాభం: దివ్యాంగ పింఛన్లకు అనర్హులని నోటీసులు అందుకున్న వారు, అర్హులైతే దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో ఎం.విజయ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 95 మంది దివ్యాంగులకు ఫించన్లకు అనర్హులని నోటీసులు ఇచ్చామని, వీరు అర్హులని భావించినట్లయితే తమను సంప్రదించి అర్జీలు పెట్టుకోవాలని తెలిపారు. పెట్టిన అర్జీలను పింఛన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తామని, వారికి షెడ్యూల్ ప్రకారం సదరం కోసం ఆస్పత్రికి హాజరు కావాలని నోటీసు జారీ చేస్తామని తెలియజేశారు. ఎప్పుడు, ఎక్కడికి హాజరు కావాలనేది నోటీసులో తెలియజేస్తామని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు గ్రామ సచివాలయాల్లో సంప్రదించాలని కోరారు.

రౌడీషీటర్ల ఇళ్లలో తనిఖీలు



కార్డన్ సెర్చ్‌లో భాగంగా తనిఖీలు నిర్వహిస్తున్న పీఎం పాలెం పోలీసులు

పీఎం పాలెం: ఇటీవల రౌడీ షీటర్ల ఆగడాలు మితిమీరుతున్న నేపథ్యంలో పీఎం పాలెం పోలీసులు మంగళవారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్ల నివాసాల వద్ద తనిఖీ చేశారు. స్టేషన్ పరిధిలో 47 మందిపై రౌడీ షీట్ నమోదై ఉన్నట్లు సీఐ బాలకృష్ణ తెలిపారు. పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు, వారి కదలికపై నిఘా పెట్టడంతో పాటు నివాసాలలో తనిఖీలు నిర్వహించామని తెలిపారు. రౌడీ షీట్ నమోదైన వారు సంఘ వ్యతిరేక కార్యలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎస్ఐ రాము, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థినుల వసతి వెతలు



పెచ్చులు ఊడి ప్రమాదకరంగా ఉన్న సైకప్పు

- శిథిలమైన ఏపీ గురుకుల పాఠశాల
- గదులు సరిపోక అవస్థలు
- వర్షం పడితే పరిస్థితి మరింత దారుణం



ఏపీ గురుకుల పాఠశాల భవనం



డార్మిటరీ లేకపోవడంతో ఒకే హాల్లో ఉన్న విద్యార్థినుల బ్యాగులు, సామగ్రి



వర్షంలో నీరు కారి తడిసిపోయిన తరగతి గది

భీమునిపట్నం: భీమిలి బీచ్‌రోడ్డులోని ఆంధ్రప్రదేశ్ బాలికల గురుకుల పాఠశాల శిథిలావస్థకు చేరుకోవడంతో, విద్యార్థినులు ఇబ్బంది పడుతున్నారు. 1986లో ఈ పాఠశాల ప్రారంభమైంది. విశాలమైన ప్రాంగణాలు ఉన్నా బాగా పాడవడంతో విద్యార్థినులకు వసతి సమస్య ఎదురవుతోంది.

గతంలో ఇలా..

ఇక్కడ 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఉండగా, మొత్తం 480 మంది విద్యార్థినులు ఉన్నారు. మొత్తం 12 తరగతి గదులు ఉండేవి. వీరు ఉండటానికి డార్మిటరీలు ఉండగా, వరుసగా పైన, కింద మంచాలు ఉండేవి. పక్కనే వంటశాల, భోజనశాలలు ఉండటంతో అక్కడే భోజనం చేసి, డార్మిటరీలోని మంచాలపై పడుకునేవారు. కానీ క్రమంగా భవనం దెబ్బతినడంతో సమస్య మొదలైంది.

విద్యార్థినులకు వసతి సమస్య

భవనం శిథిలమవడంతో విద్యార్థినులకు వసతి సమస్య మొదలైంది. గతంలో ఇక్కడ నిర్మించిన కొత్త భవనంలో కింద, పైన మొత్తం ఆరు గదులు ఉన్నాయి. వాటిలో సుమారు 300 మంది వరకు పడుకుంటున్నారు. పాత భవనంలోని కాస్త బాగున్న రెండు గదుల్లో 180 మంది విద్యార్థినులు సర్దుకోవాల్సి వస్తోంది.

డార్మిటరీ,వంటశాల కూల్చివేత

ఇందులో విద్యార్థినులు ఉండే డార్మిటరీ, వంటశాల పూర్తిగా దెబ్బతిని, ప్రమాదకరంగా మారడంతో మూడు నెలల క్రితం వాటిని కూల్చివేశారు. పాత భవనంలోని రెండు గదులు కొద్దిగా బాగుండడంతో ఒక దాంట్లో వంటశాలను నిర్వహిస్తుండగా మరో గదిని మూసివేశారు. విద్యార్థులు అంతకు ముందు వీరు ఉండే డార్మిటరీలోని మంచాల వద్ద తమ బ్యాగులు, సామగ్రిని ఉంచుకునే వారు, కానీ, ఇప్పుడు ఆ అవకాశం లేక రెండు గదుల్లో వీటిని ఉంచుతున్నారు. ఒకవైపు తరగతి గదులు శిథిలమై, మరోవైపు వసతి సరిగ్గా లేకపోవడంతో విద్యార్థినులకు చదువుకునేందుకు, ఉండటానికి చాలాకష్టంగా ఉంటోంది, మరోవైపు ఉపాధ్యాయులకూ సమస్యగా మారింది.

పాడైన ప్రధాన భవనం, గదులు

ఇక్కడి ప్రధాన భవనం బాగా పాడైపోయింది. అందులోనే తరగతి గదులు, ప్రిన్సిపాల్ కార్యాలయం ఉన్నాయి. ఇవన్నీ దెబ్బ తినడంతో పరిస్థితి ప్రమాదకరంగా ఉంది. గదుల పైకప్పులు పెచ్చులూడిపోవడంతో, వర్షం పడితే గదులు బాగా కారిపోతున్నాయి. దీంతో తరగతుల నిర్వహణ కష్టంగా ఉంటోంది.



దెబ్బ తిన్న డార్మిటరీ హాల్లోనే నిర్వహిస్తున్న వంటశాల



శిథిలమై మూతపడ్డ డార్మిటరీ గది



తరగతి గదిలో విద్యార్థినులు

ఇంజినీర్లు పరిశీలించారు

ఇక్కడి పరిస్థితుల గురించి ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శికి ప్రిన్సిపాల్ జయప్రకాశ్ సమాచారం ఇచ్చారు. దీనిపై జిల్లా కలెక్టర్‌కు సమాచారం అందగా, ఆయన ఆదేశాల మేరకు ఇటీవల ముగ్గురు ఇంజినీర్లు వచ్చి పరిస్థితులను పరిశీలించి వెళ్లారు.

– కె. రామలక్ష్మి, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్

ముగిసిన కృష్ణాష్టమి వేడుకలు



దివీస్ రోడ్డులోని ఊరేగింపులో కోలాట సంబరం

తగరపువలస: త్రైతసిద్ధాంత భగవద్గీత, ఇందుజ్ఞానవేదిక ప్రబోధానందుని శిష్యులు నాలుగు రోజుల పాటు గుడివాడలో నిర్వహించిన శ్రీకృష్ణాష్టమి వేడుకలు మంగళవారం నాటి ఊరేగింపుతో ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి విశాఖపట్నం, భీమిలి, విజయనగరం, గాజువాక, కాకినాడ, రాజాం తదితర ప్రాంతాల నుంచి వందలాది మంది ప్రబోధానందుని శిష్యులు హాజరయ్యారు. ముందుగా మొక్క వెంకటరమణ, బోని రావణ అక్షయ్ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు ముగించి, దివీస్ రోడ్డుతో పాటు గుడివాడలో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దాసరి చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు చిల్ల దుర్గారావు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు చిల్ల అప్పలరామిరెడ్డి, ఇందుజ్ఞాన వేదిక సభ్యులు పాల్గొన్నారు.

పాతపరదేశిపాలెం వంతెనను పరిశీలించిన కమిషనర్



వంతెనను పరిశీలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

కొమ్మాది: జీవీఎంసీ జోన్-1 పరిధి పాతపరదేశిపాలెంలోని పురాతన వంతెన వలన ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా నూతన వంతెన నిర్మాణం చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ అధికారులను ఆదేశించారు. జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులు, ఆర్‌అండ్‌బీ ఎస్ఈలతో కలసి ఇక్కడి వంతెనను మంగళవారం పరిశీలించారు. పాతపరదేశిపాలెం ప్రాంతంలో ఉన్న గెడ్డ వద్ద వంతెనపై నుంచి వర్షపు నీరు పారుతున్నందున, సమీపంలో ఉన్న ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నందున నూతన వంతెన నిర్మాణానికి అంచనాలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జోన్-1,2 జోనల్ కమిషనర్లు అయ్యప్పనాయుడు, కనకమహాలక్ష్మి, ఇంజినీర్లు జాన్స్ సుధాకర్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఉధృతంగా 'గోస్తని' ప్రవాహం



చిట్టివలస వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గోస్తనినది

తగరపువలస: ఇటీవల మూడు రోజుల పాటు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు గోస్తనినది భీమిలి మండలంలో ఉధృతంగా ప్రవహిస్తోంది. ఏప్రిల్ నుంచి నీరు లేక ఉన్న, గోస్తని పరీవాహక ప్రాంతం ఇప్పుడు నిండుగా కనిపిస్తోంది. నదీ ప్రవాహంలో చెరువులను కలుపుకొంటూ వెళ్తుండటంతో వాటికి కూడా జలకళ ఉట్టిపడుతోంది.

నీట మునిగిన ఊటబావులు

జీవీఎంసీ ప్రజలకు తాగునీరు సరఫరా చేసే ఆనందపురం మండలంలోని బోని, పద్మనాభం మండలంలోని సామియ్యవలస, భీమిలి మండలంలోని టి.నగరపాలెం వద్ద ఊటబావులు నీట మునిగిపోయాయి. దీంతో భీమిలి జోన్‌లోని కృత్రిమ రిజర్వాయర్లలో బురదనీరు వచ్చి చేరింది. దీంతో మంగళవారం భీమిలి జోన్‌లో తాగునీరు సరఫరా చేయలేదు. ముందస్తు సమాచారం లేక ప్రజలు తాగునీటి కోసం ఇబ్బంది పడ్డారు. తాగునీటి సరఫరా సిబ్బంది రిజర్వాయర్లలో ఆలం చేర్చి ఉంచారు. బుధవారం నాటికి బురదనీరు తేరితే కుళాయిల ద్వారా సరఫరా చేయనున్నారు. ఇటీవల ఎండలకు అడుగంటిన బోరుబావులలో సైతం నీరు చేరుతుండటంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

తాగునీరు కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

జెడ్పీ సీఈవో నారాయణమూర్తి



లొడగలవానిపాలెంలో వాటర్ ట్యాంకు పరిసరాలను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈవో నారాయణమూర్తి

తగరపువలస: పారిశుధ్యానికి ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు తాగునీరు కలుషితం కాకుండా చూడాలని జెడ్పీ సీఈవో పి.నారాయణమూర్తి సూచించారు. ఆనందపురం మండలం లొడగలవానిపాలెం పంచాయతీలో మంగళవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా అధికారులకు సూచనలు చేశారు. విస్తారంగా వర్షాలు కురిసినందున ప్రజల ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. చెత్తను సేంద్రీయ ఎరువుగా మార్చి పంచాయితీలకు ఆదాయం సమకూర్చాలన్నారు. ప్రతి గృహానికి టాయిలెట్ ఉండాలన్నారు. ఆయన వెంట ఎంపీడీవో జానకి, డిప్యూటీ ఎంపీడీవో సత్యనారాయణ, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

సీపీఐ మహాసభలకు భీమిలి నాయకులు



మహా సభల పోస్టర్ విడుదల చేస్తున్న సీపీఐ నాయకులు

తగరపువలస: బుధవారం నుంచి ఆరు రోజుల పాటు ప్రకాశం జిల్లా ఒంగోలులో జరగనున్న సీపీఐ 28వ రాష్ట్ర మహాసభలకు భీమిలి నాయకులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా గుజ్జు రామునాయుడు భవన్‌లో మంగళవారం మహాసభల పోస్టర్ ఆవిష్కరించారు. సీపీఐ నూరేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించే ఈ సభలలో రాష్ట్ర, జాతీయ స్థాయి ప్రజల సమస్యలను చర్చించేందుకు రాష్ట్ర అధ్యక్షుడు కె.రామకృష్ణ, జాతీయ నాయకులు డి.రాజా, కె.నారాయణ తదితరులు హాజరవుతారన్నారు. పోస్టర్ ఆవిష్కరణలో నాయకులు కానూరి రాంబాబు, మోర అప్పలరాజు, కొండపు ఈశ్వరరావు, చిల్ల రాంపైడి, చిల్ల నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

మధురవాడలో..

కొమ్మాది: భారత కమ్యూనిష్టు పార్టీ రాష్ట్ర 28వ మహాసభల పోస్టర్‌ను సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మరుపిళ్ల పైడిరాజు తదితరులు మధురవాడలో బుధవారం ఆవిష్కరించారు. లూలూ సంస్థకు భూమి ఉత్తర్వులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ కార్యదర్శి వాండ్రాసి సత్యనారాయణ, వెంకట అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

అత్యున్నత ప్రమాణాలే దేశాభివృద్ధికి కీలకం

బీఐఎస్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ మీనాక్షి గణేశన్



మీనాక్షి గణేశన్‌కు జ్ఞాపిక అందజేస్తున్న వీసీ రాజశేఖర్

విశాఖ విద్య: అత్యున్నత ప్రమాణాలతో ఉత్పత్తులను తయారు చేయడం దేశాభివృద్ధిలో కీలకమని బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) డిప్యూటీ డైరెక్టర్ జనరల్ (సౌత్) మీనాక్షి గణేశన్ అన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం సివిల్ ఇంజినీరింగ్ విభాగం సమావేశ మందిరంలో ఏయూ ఇంజినీరింగ్ కళాశాలతో సంయుక్తంగా బీఐఎస్ నిర్వహిస్తున్న ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ 'స్టాండరైజేషన్ అండ్ కన్‌ఫార్మిటీ అసెస్‌మెంట్'ను మంగళవారం ఆమె ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఒక సంస్థకు, ఒక వ్యవస్థకు శక్తినిచ్చేవి కేవలం ప్రమాణాలేనని అన్నారు. మూడు రోజుల శిక్షణలో భాగంగా అధ్యాపకులకు భారతీయ, అంతర్జాతీయ ప్రమాణాలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. 2023లో ఆంధ్ర విశ్వవిద్యాలయం బీఐఎస్‌తో అవగాహన ఒప్పందం చేసుకొని విభిన్న కార్యక్రమాలను, పరిశోధనా ప్రాజెక్టులను నిర్వహిస్తోందన్నారు. ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ మాట్లాడుతూ ప్రమాణాలను కరిక్యులంలో భాగంగా చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ దిశగా త్వరలో చర్యలు చేపడతామని చెప్పారు. ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి.శశిభూషణరావు మాట్లాడుతూ ఇప్పటికే మూడు విభాగాల్లో బీఐఎస్ విద్యార్థి శాఖలను ఏర్పాటు చేశామని, మరొక నూతన శాఖను ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. ఎఫ్‌డీపీ కార్యక్రమ సమన్వయకర్త ఆచార్య సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం



చెక్కు అందిస్తున్న దాత రాంబాబు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి నగరంలోని శంకరమఠానికి చెందిన పి.రాంబాబు రూ.లక్ష 11 వేల 116 విరాళాన్ని మంగళవారం అందించారు. సంబంధిత విరాళాన్ని చెక్కు రూపంలో సింహగిరిపై పీఆర్వో కార్యాలయంలో ప్రొటోకాల్ సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, సీనియర్ అసిస్టెంట్ సూర్యనారాయణకు అందజేశారు. దేవస్థానం తరఫున దాతకు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రం అందించారు.

• మంగళకారిణి.. సౌభాగ్యప్రదాయిని



శ్రావణమాసం ఆఖరి మంగళవారం అమ్మవార్లు ప్రత్యేక అలంకరణలో మంగళకారిణిగా దర్శనమిచ్చారు. భీమిలి మండలం మజ్జివలస గ్రామదేవత రాస పోలమాంబ అమ్మవారిని తులసి, జాజుల మాలలతో అలంకరించారు. ఈ అలంకరణకు పద్మనాభం మండలం గొల్లలపాలెం గ్రామానికి చెందిన అయితి అప్పలరాజు, సంజన, సాయిదీక్షిత, గోపికశ్రీ సహకారం అందించారు. దివీస్ రోడ్డులోని మద్దిపేట వద్ద గుడివాడ గ్రామదేవత తోగాలమ్మను గాజులతోను, ముత్యాలమ్మను పసుపు కొమ్ములతో అలంకరించి, భక్తులకు దర్శనాలు కల్పించారు.

– తగరపువలస

ఊయల ఊగేదెలా?




ఊయల కింద వర్షపు నీరు

కొమ్మాది: ప్రముఖ పర్యాటక ప్రాంతం రుషికొండ బీచ్ చిల్డ్రన్స్ పార్కులో చిన్నారులు ఆడుకునేందుకు ఇబ్బందులు తప్పడం లేదు. మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఈ పార్కు అంతా బురదగా మారింది. దీంతో ఇక్కడికి వచ్చిన చిన్నారులు ఇబ్బంది పడ్డారు. ఊయల కిందిభాగంగా వర్షం నీరు నిల్వ ఉండటంతో, వెనుదిరిగి వెళ్లిపోతున్నారు.

వానొస్తే .. వణుకే

బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్న కొండవాలు ప్రాంతవాసులు



సత్యనారాయణ కొండవాలు ప్రాంతంలో ప్రమాదకరంగా ఇళ్లు

తగరపువలస: ఇటీవల వర్షాలకు స్థానిక రమా సత్యనారాయణస్వామి కొండపై ఆలయ మెట్ల మార్గమార్గంలో గ్రావెల్, రాళ్లు మంగళవారం జారిపడటంతో అక్కడ ఇళ్లు నిర్మించుకున్నవారు ఆందోళన చెందుతున్నారు. గతంలో చాలాసార్లు కొండ చుట్టూ రక్షణగోడలు శిథిలమై వర్షాలకు జారిపోయిన సంగతి తెలిసిందే. రెండేళ్ల క్రితం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చిట్టివలస రైతుబజారు సమీపంలో కూలిపోయిన రక్షణగోడను రూ.76 లక్షలతో పునరుద్ధరించింది. అలాగే ప్రైవేట్ మార్కెట్ వైపు మెట్లను ఆధునికీకరించి రక్షణ గోడను కూడా ఏర్పాటు చేశారు. ఇంకా పాత మీ సేవ కార్యాలయం, గ్రంథాలయవీధి నుంచి కొండవాలు ప్రాంతానికి చేరేమార్గం బలహీనంగా ఉంది. ఈ ప్రాంతం వాలులో సామర్థ్యానికి మించి భవనాలు వెలసి ఉన్నాయి. దీంతో వర్షానికి రాళ్ల కింద నుంచి నీరు చేరి అప్పుడప్పుడు ఇళ్లపైపు గ్రావెల్, రాళ్లు తోసుకురావడం జరుగుతోంది. వర్షాకాల సమయంలో కొండవాలు ప్రాంతంలో తరచూ జరుగుతున్న ప్రమాదాలను దృష్టిలో పెట్టుకుని జీవీఎంసీ కొండ చుట్టూ పటిష్ఠమైన రక్షణగోడల నిర్మాణం చేపట్టాలని సత్యనారాయణ వాలు ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

రోడ్డుపైనే వర్షపు నీరు



జీ-2 కాలనీకి వెళ్లే రోడ్డులో నిలిచిపోయిన వాననీరు

పీఎం పాలెం: వరుణుడు శాంతించినా జీవీఎంసీ ఆరోవార్డులోని పీఎం పాలెంలోని చాలా రహదారుల్లో నీరు ఇంకా ఇంకలేదు. గుంతల్లో నీరు నిలిచిపోవడంతో వాహనచోదకులు, పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. వాననీటిలో వాహనాలు ప్రయాణించినప్పుడు ఆ నీరు పాదచారులపై తుళ్లడంతో దుస్తులు పాడవుతున్నాయి. దీంతో ఆ ప్రాంతాల్లో ప్రయాణమంటేనే హడలిపోతున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ ఇంజినీరింగ్ విభాగం అధికారులు స్పందించి రోడ్లపై గోతులు పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు.

విమానాల రూపకల్పనలో డిజైన్ థింకింగ్ కీలకం



ప్రొఫెసర్ పడాల్‌ను సత్కరిస్తున్న ఎఫ్‌డీపీ ప్రతినిధులు



పాల్గొన్న పాలిటెక్నిక్ ఫ్యాకల్టీ

మురళీనగర్: విమానాల రూపకల్పనలోని వైఫల్యాలను గుర్తించి, వాటిని అధిగమించేందుకు డిజైన్ థింకింగ్ విధానం ఉపయోగపడుతుందని ఆంధ్ర విశ్వ విద్యాలయం ప్రొఫెసర్ కె.టి.బి. పడాల్ అన్నారు. కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో ఫ్యాకల్టీ డెవలప్‌మెంటు ప్రోగ్రాంలో భాగంగా న్యూమరికల్ అప్రోచ్ ఇన్ డిజైన్ థింకింగ్‌పై జరిగిన శిక్షణలో ఆయన ప్రత్యేక అతిథిగా పాల్గొని రెండవ రోజు ఉన్యాసం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విమానాల డిజైన్‌లో సంఖ్యా పద్ధతుల ప్రాముఖ్యత, క్రైస్టలాగ్రాఫికల్ వైఫల్యాలు, వాటి పరిష్కారాలపై విశ్లేషణాత్మకంగా వివరించారు. రాఘవ ఇంజినీరింగ్ కళాశాల ప్రొఫెసర్ హేమలత మాట్లాడుతూ మల్టీ-క్రైటీరియా డెసిషన్ మేకింగ్ (ఎంసీడీఎం) అప్రోచ్ ప్రాముఖ్యతను వివరించారు. బహుళ ప్రమాణాల ఆధారంగా కచ్చితమైన డిజైన్ ఎంపిక, సమస్య పరిష్కారం, పరిశోధనాత్మకత దిశలో నిర్ణయాలు తీసుకోవడం వంటి అంశాలను ఉదాహరణలతో వివరిస్తూ, ఈ పద్ధతిని ఎఫ్‌డీపీకి అనుసంధానించే మార్గాలను వివరించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ కేబీటీ పడాల్‌ను సత్కరించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ రత్నకుమార్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని కో-ఆర్డినేటర్ డాక్టర్ సీహెచ్ రాజు, కో-కోఆర్డినేటర్ ఎం.భరణి పర్యవేక్షించారు.

కొనసాగుతున్న ఐవీఎఫ్ సెంటర్ల తనిఖీలు



నిర్వాహకులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మహారాణిపేట: జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు, ఇతర వైద్యులు మంగళవారం నగరంలోని పలు ఐవీఎఫ్ సెంటర్లను తనిఖీ చేశారు. గిగ్లెస్ ఒమ్ని ఆర్కే, నోవా ఐవీఎఫ్, లాన్సెట్ కేంద్రాల రిజిస్ట్రేషన్, రికార్డులు, ఇతర పత్రాలను అధికారులు పరిశీలించారు. ఇప్పటివరకు ఎంతమందికి సంతానోత్పత్తి చికిత్స చేశారు వంటి వివరాలను డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు అడిగి తెలుసుకున్నారు. స్కానింగ్ గది బయట, లోపల, రిసెప్షన్‌లో ధరల పట్టికను, ఇతర బోర్డులను తప్పనిసరిగా ప్రదర్శించాలని సూచించారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేయరాదని, ప్రతీ ఫారం-ఎఫ్ ఆన్‌లైన్‌లో సబ్మిట్ చేయాలని ఆదేశించారు. ఫారం-ఎఫ్‌పై గర్భిణి, స్కానింగ్ చేసే వైద్యుడి సంతకాలు ఉండాలని స్పష్టం చేశారు. నిర్దేశించిన గడువు కంటే రెండు నెలల ముందుగానే రెన్యువల్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని నిర్వాహకులను ఆదేశించారు. నోడల్ అధికారి డాక్టర్ బి.ఉమావతి, జిల్లా మీడియా విస్తరణాధికారి బి.నాగేశ్వరరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.